

**సీసీ రోడ్డు తవ్విన వ్యక్తికి**

నూతనంగా వేసిన సీసీ రోడ్డును ఓ వ్యక్తి అనుమతి లేకుండా తవ్వడంతో అధికారులు జరిమానా విధించారు. 8లో▸



**రీయింబర్స్‌మెంట్..**

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ చేశారు. 8లో▸

**నెమలి మృతి**



విద్యుదాఘాతంతో జాతీయ పక్షి నెమలి మృత్యువాత పడిన సంఘటన ఇబ్రహీంపట్నం కోర్టు సమీపంలో చోటుచేసుకుంది. 8లో▸

## న్యూస్‌రీల్

### మొక్కలు విరివిగా నాటాలి



వన మహోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

**కందుకూరు:** మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గనులు భూగర్భశాఖ ఏడీ నర్సిరెడ్డి, అటవీశాఖ ఎఫ్‌ఆర్‌ఓ భావన సూచించారు. మండలంలోని రాచులూరు రెవెన్యూ పరిధిలో రాక్‌శాండ్ మినరల్స్, సునీత టెక్ సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్‌లో వాతావరణ సమతుల్యత కోసం ఇప్పటి నుంచే మొక్కలు నాటడం ఓ వ్యాపకంలా పెట్టుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టి భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు పి.పూర్ణచందర్, డీఎస్ దీక్షితులు, అటవీ, గనుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం



హన్మానాయక్

**కడ్తాల్:** మైదాన ప్రాంత గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతోందని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర గిరిజన జనాభాలో రెండు, మూడు శాతం ఉండే ఏజెన్సీ గిరిజనులకు గత ఎన్నికల సమయంలో 12 అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంట్ స్థానాలు కేటాయించి, 7 నుంచి 8 శాతం ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకుండా గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. మూడు జిల్లాల్లోని ఏజెన్సీ గిరిజనులకే చట్టసభల్లో అవకాశం కల్పించి, మైదాన ప్రాంతానికి చెందిన 7 జిల్లాల గిరిజనులను చట్టసభలకు రాకుండా నిరోధించారని విమర్శించారు. మైదాన ప్రాంత గిరిజనుల హక్కుల పరిరక్షణకు బుధవారం హైదరాబాద్‌లోని గిరిజన భవన్‌లో నిర్వహించనున్న తెలంగాణ మైదాన ప్రాంత గిరిజనుల ఐక్యవేదిక సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### విరబూసిన బ్రహ్మకమలాలు



**షాబాద్:** మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలోని పట్నంశెట్టి సంతోష్‌కుమార్ ఇంట్లో అరుదైన బ్రహ్మకమలాలు వికసించాయి. మూడేళ్ల క్రితం మొక్క నాటగా ఇప్పుడు ఒకేసారి 11 పూలు విరబూసాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.

### సూర్యగిరి ఎల్లమ్మకు ఆషాఢం పూజలు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

**తుక్కుగూడ:** ఆషాఢ మాసం చివరి మంగళవారం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దర్శనం కోసం భక్తులు ఉదయం నుండే క్యూ కట్టారు. భక్తితో బోనాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈట మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ❖ వాన.. కురిసిన తరుణాన..





తిమ్మారెడ్డిగూడలో పత్తి పంటలో ఎరువులు చల్లుతున్న రైతులు



షాబాద్ పరిధిలో నిండుగా ప్రవహిస్తున్న ఈసీ వాగు



యాచారం: మంతన్‌గౌరెల్లిలో నాటుకు సిద్ధమైన వరినారు

**షాబాద్:** మూడునాలుగు రోజులుగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. పంటలు దెబ్బతింటున్న తరుణంలో పంటలకు ప్రాణం పోసినట్లయింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, తిర్మలాపూర్, ఏట్ల ఎర్రవల్లి, బొబ్బిలిగామ, రేగడి దోస్వాడ గ్రామాల్లో ఎక్కువగా పత్తి పంటను సాగుచేశారు. చేనుకు ఎరువులు చల్లడం మొదలు పెట్టారు.

**నిండుగా పారుతున్న ఈసీ వాగు**

మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈసీ వాగు నిండుగా పారుతోంది. మండల పరిధిలోని నాగరగూడ, తిమ్మారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి, తాళ్లపల్లి, హైతాబాద్, సోలీపేట్ గ్రామాల సరిహద్దు నుంచి వెళ్లే వాగు పొంగిపొర్లుతోంది. బోరుబావుల్లోకి పుష్కలంగా నీరు చేరుతుందని, పంటలకు ఢోకా ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళలకు పెద్దపీట

- పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం
- షాద్‌నగర్ సభలో మంత్రి శ్రీధర్‌బాబు



మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

**షాద్‌నగర్‌రూరల్:** మహిళా సంఘాలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు అందిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 3,418 మహిళా సంఘాలకు రూ.3.29 కోట్ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి సంబురాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చామన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వం తీసుకుందన్నారు.

**వెయ్యి మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు**

మహిళా సంఘాల ఆధ్వర్యంలో మొదటి దశలో వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులను అందుబాటులోకి తెస్తున్నట్లు, ప్రతి మండలంలో కనీసం ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ప్రజల్లో అయోమయాన్ని సృష్టించే విధంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇలాంటి ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. గత పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తంగా మార్చి అప్పుల తెలంగాణగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోందని అన్నారు.

**రుణాలు సద్వినియోగం చేసుకోవాలి**

మహిళా సంఘాల సంఘటితమై ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మహిళలతోనే సమాజంలో మార్పు సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు భీష్వ కిష్టయ్య, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యాదయ్య యాదవ్, వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్, బాల్‌రాజ్, శివశంకర్‌గౌడ్, విశ్వం, రఘు నాయక్, జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, పీడీ శ్రీలత పాల్గొన్నారు.

## ఎల్కగూడ రైతులకు వక్ఫ్‌బోర్డు షాక్

- 187.27 ఎకరాల భూమిని ఖాళీ చేయాలంటూ నోటీసులు
- 25న ఆధారాలతో రావాలని సూచన
- ఆందోళనలో బాధితులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులు

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** తాతల కాలం నుంచి భూములు సాగుచేసుకుంటున్న రైతులకు వక్ఫ్‌బోర్డ్ అధికారులు షాక్ ఇచ్చారు. 187.27 ఎకరాల భూమిని ఖాళీ చేయాలంటూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మీ దగ్గర ఉన్న ఆధారాలతో ఈనెల 25న వక్ఫ్‌బోర్డ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూ సర్వేనంబర్ 559, 560, 561, 562, 563, 564, 565, 566, 567, 568, 569, 570, 571, 572, 580, 581, 582, 583లలో 187.27 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఎల్కగూడ గ్రామానికి చెందిన సుమారు వంద మంది రైతులు తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లోనూ వీరి పేర్లు నమోదవుతూ వచ్చాయి. రెవెన్యూ శాఖ నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు సైతం జారీ చేశారు.

**ఆ స్థలం చౌలపల్లి మసీద్‌ది..**

ఎల్కగూడ రైతులు సాగుచేసుకుంటున్న 187.27 ఎకరాల భూమి వక్ఫ్ బోర్డ్‌కు చెందినదిగా ఈనెల 10న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితం ఇవి రైతులకు అందాయి. ఎల్కగూడలోని 187.27 ఎకరాల భూమి షాద్‌నగర్‌లోని చౌలపల్లి జామా మసీద్‌కు చెందినదని.. ఈ భూములకు సంబంధించి మీ దగ్గర ఉన్న ఆధారాలతో ఈ నెల 25న వక్ఫ్‌బోర్డ్ అధికారులను సంప్రదించాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తి చేయాలి
- వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి

**ఇబ్రహీంపట్నం రూరల్:** విధుల్లో నిర్లక్ష్య వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సి. నారాయణరెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వసతి గృహాల్లో మౌలిక సదుపాయలు, గురుకుల పాఠశాలల సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, వనమహోత్సవంపై సంబంధిత అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయిలో ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో తప్పనిసరి పర్యటించాలని అన్నారు. స్థానిక వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో మౌలిక వసతులు అందుతున్నాయో లేదో తెలుసుకొని ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణ పురోగతిని బట్టి చెల్లించాల్సిన మొత్తాన్ని లబ్ధిదారులకు వెంటనే అందజేయాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం మొక్కలు నాటాలని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో ఈత మొక్కలు పెంచేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీత, పీడీ హౌసింగ్ హనుమంతు నాయక్, డీపీఓ సురేష్‌మోహన్, ఉద్యాన శాఖ అధికారి సురేష్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, డీఈఓ సుశీందర్‌రావు, బీసీ సంక్షేమ శాఖ కేశూరాం, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రామారావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల రూపురేఖలు మారుస్తాం



ఇబ్రహీంపట్నంరూరల్: తులేకలాన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం రూరల్:** కాంగ్రెస్ పాలనలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని తులేకలాన్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, అంగన్వాడీ కార్యాలయం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను ఆపడం లేదని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, అమృత సాగర్, సత్తు శశాంక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**యాచారం మండల పరిధిలో..**

**యాచారం:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన పరిశ్రమలు ఇక్కడికి తరలిరానున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు. అనంతరం గునుగల్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్క నాటారు. యాచారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అటవీ శాఖ అభివృద్ధి అధికారి వేణుమాధవరావు, రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, యాచారం మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు శ్రీనువాస్‌రెడ్డి, రామకృష్ణ, పార్టీ నేతలు ఈసీ శేఖర్‌గౌడ్, బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, అమృతా సాగర్, మండల ప్రత్యేకాధికారి మాధవరావు, ఎంపీడీఓ రాధారాణి, తహసీల్దార్ అయ్యప్ప, పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కలువకపాయె!

**పింఛన్ కోసం దివ్యాంగుడి కంటతడి**



రాజును ఎత్తుకుని తీసుకువస్తున్న దృశ్యం

**యాచారం:** గునుగల్ గ్రామానికి చెందిన మచ్చ రాజుకు కొన్నేళ్ల క్రితం పక్షవాతం రావడంతో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి.. కట్టుకున్న భార్య వదిలేసి వెళ్లింది. ఎనభై ఏళ్ల వృద్ధురాలైన తల్లి భిక్షాటన చేస్తూ తన కొడుకుతో పాటు అతని కొడుకునూ సాకుతోంది. ప్రభుత్వం నుంచి పింఛన్ ఇప్పించమని కోరుతూ రాజు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం కనిపించలేదు. మంగళవారం తమ గ్రామానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వస్తున్నారని తెలుసుకుని నేలపై దేకుతూ.. తన తల్లి, కొడుకు ఏసుతో కలిసి పంచాయతీ కార్యాలయానికి వచ్చాడు. అప్పటికే ఎమ్మెల్యే అక్కడి నుంచి పక్క కాలనీకి వెళ్లిపోవడంతో నిరాశకు గురయ్యాడు. అక్కడే ఉన్న రాజు బంధువు నర్సింహ, కొడుకు ఏసు అతన్ని ఎత్తుకుని పక్కకాలనీలోకి తీసుకెళ్లేసరికి కాన్వాయ్ వెళ్లిపోయింది. 'ఎమ్మెల్యే కలవకపాయె' అంటూ రాజు కంటతడి పెట్టుకోవడం అక్కడున్న వారిని కలచివేసింది.

## మూగజీవాల మృత్యువాత

- విద్యుదాఘాతంతో 47 గొర్రెలు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన గొర్రెలు

**మొయినాబాద్:** వర్షం పడి తడిగా ఉన్న రేకుల షెడ్డుకు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై 47 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కొడిచర్ల కుమార్ గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే వాటిని సోమవారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న రేకుల షెడ్డులో తోలాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వర్షం పడింది. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు రేకుల షెడ్డుకు తగిలాయి. షెడ్డుకు ఉన్న ఇనుపస్తంభాలకు విద్యుత్ సరఫరా అయ్యి గొర్రెలకు కరెంట్ షాక్ తగిలింది. నిద్రలేచిన కుమార్ షెడ్డులోకి వెళ్లి చూడగా అప్పటికే చాలా గొర్రెలు మృతి చెందాయి. కుమార్ స్తంభాన్ని పట్టుకోవడంతో అతనికి సైతం షాక్ తగిలింది. షెడ్డు మొత్తానికి కరెంటు షాక్ వస్తుందని గమనించి బతికి ఉన్న కొన్ని గొర్రెలను బయటకు తరలించాడు. మొత్తం 47 గొర్రెలు మృతి చెందాయని, వాటి విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని తెలిపాడు. కూతురు పెళ్లి కోసం అమ్మకుండా ఉంచానని.. వాటిని అమ్మి పెళ్లి చేద్దామనుకుంటే ఇంత ఘోరం జరిగిందని బోరున విలపించాడు. పశువైద్యాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై స్పందించిన తహసీల్దార్ గౌతమ్‌కుమార్ ప్రభుత్వం నుంచి గొర్రెకు రూ.3 వేల చొప్పున పరిహారం అందించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## కనుల పండువగా పవిత్రోత్సవం



**కొడంగల్:** పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. నిత్య కైంకర్యాల్లో మంత్రలోపం, క్రియాలోపం, ద్రవ్యలోపం దోష నివారణ కోసం పవిత్రోత్సవాలను మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. టీటీడీ అర్చకులు వేద మంత్రోచ్ఛరణాలతో హోమాలు నిర్వహించారు.

## సీసీ రోడ్డు తవ్విన వ్యక్తికి జరిమానా


రాములు నుంచి జరిమానా డబ్బును వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**శంకర్‌పల్లి:** మున్సిపాలిటీ పరిధిలోని రామంతపూర్‌లో నూతనంగా వేసిన సీసీ రోడ్డును ఓ వ్యక్తి అనుమతి లేకుండా తవ్వడంతో.. మంగళవారం కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు రూ. 20వేల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. రామంతపూర్‌కి చెందిన జానంపేట రాములు తన ఇంటికి మురుగునీటి పైప్‌లైన్ వేసేందుకు గతంలో రోడ్డు తవ్వేందుకు మున్సిపల్ అనుమతి కోరాడు. దీనిని పరిశీలించిన అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించి, వినతిని తిరస్కరించారు. అది పెడచెవిన పెట్టిన ఆయన నూతనంగా వేసిన సీసీ రోడ్డును తవ్వాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు పరిశీలించి, రూ.20వేల జరిమానా విధించి వసూలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అమర్‌నాథ్, భరత్, రాజు, శివ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్య సేవలు


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో సమావేశమైన నోవా గ్రూప్స్ ప్రతినిధులు

**అబ్దుల్లాపూర్‌మెట్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్టీఐ మాజీ కమిషనర్, నోవా విద్యా సంస్థల చైర్‌పర్సన్ ముత్తెంశెట్టి విజయనిర్మల, సెక్రటరీ కృష్ణారావు మంగళవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ, ఏపీ, త్రిపురలోని ఆదివాసీ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, విద్యావకాశాల విస్తరణకు తమ సంస్థలు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏజెన్సీ, రిమోట్ ఏరియాల్లో సేవలు అందించేందుకు ప్రభుత్వాల సహకారంతో ముందుకు వెళ్లేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని చెప్పారు.

# వర్షం.. హర్షం

అదును దాటుతున్నా సమృద్ధి వర్షాలు లేక కలవరపడిన కర్షకులకు భారీ ఊరట లభించింది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలతో పంటలు కళకళలాడుతున్నాయి.

- భారీ వానలతో మెట్ట పంటలకు ఊతం
- గ్రామాల్లో సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు


కొత్తపల్లి-తక్కళ్లపల్లి గ్రామాల మధ్య కళకళలాడుతున్న పత్తి పంట

**యాచారం:** ఇటీవల కురుస్తున్న కుండపోత వర్షంతో పత్తి పంటకు ఊపిరి పోసినట్లు అయింది. చాలా రోజులుగా వానలు లేక పత్తి పంట వాడిపోయే దశకు చేరింది. వరుణుడి అనుగ్రహం వల్ల రెండు రోజులుగా ఆయా గ్రామాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లో జల వనరులు సైతం పెరిగాయి. దీంతో పత్తి పంటతో పాటు ఆముదం, కంది, జొన్న, మొక్కజొన్న, తదితర మెట్ట పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో దాదాపు 35 వేల ఎకరాలకు పైగా పత్తి, ఇతర మెట్ట పంటలను సాగు చేశారు. పత్తి సాగుకు ఎకరాకు రూ.20 వేలకు పైగానే రైతులు ఖర్చు చేశారు. గడిచిన రెండేళ్లుగా పత్తికి మంచి డిమాండ్ ఉండడంతో కర్షకులు మంచి లాభాలు పొందారు.

### వరి నాట్లకు సిద్ధం

జోరు వర్షాలతో బోరుబావుల్లోకి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుందని రైతుల్లో ఆశలు పెరిగాయి. మండల పరిధిలోని యాచారం, మాల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, చింతపట్ల, మొండిగౌరెల్లి, మల్కీజ్‌గూడ, నందివనపర్తి, గునుగల్, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షం భూమిలో ఇంకిన నీళ్లతో బోరుబావుల్లో జలాలు పెరిగే అవకాశం ఉంటుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో అత్యధిక వరి పంటను పండిస్తారు. ఆయా మండలాల్లోని చింతపట్ల, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, లోయపల్లి, బోడకొండ, ఎల్లమ్మతండా, రాయపోల్, దండుమైలారం తదితర గ్రామాల్లో దాదాపు 25 వేల ఎకరాలకు పైగా వరి పంటను పండిస్తారు. ఇప్పటికి కేవలం వెయ్యి ఎకరాల్లోపు మాత్రమే వరి పంటను సాగు చేశారు. వానాకాలంలో వర్షాలు కురిస్తే వరి పంట సాగు చేసుకోవచ్చనే ఆశతో కర్షకులు నార్లు పోసుకుని ఉంచారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉంది.

### “ఆశలు చిగురించాయి



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్ట పంటలకు ఊపిరి పోసినట్లు అయింది. పది ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఐదు ఎకరాలకు పైగా వరి పంట సాగు చేయడానికి నార్లు పోశాను. కురుస్తున్న వర్షాలతో వరి పంట సాగుపై ఆశలు పెరిగాయి. పత్తి పంట ఎదిగే అవకాశం ఉంది.

– బీరప్ప, రైతు, నక్కర్తమేడిపల్లి

### పంటలకు ప్రాణం



భారీ వర్షాలకు మెట్ట పంటలకు ప్రాణం పోసినట్లు అయింది. ముఖ్యంగా పత్తి పంటకు ఎంతో మేలు జరిగింది. కుండపోత వర్షాలతో బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. ముందే వరి నార్లు పోసిన రైతులు వరి నారును వేసుకోవచ్చు. వరి నాట్లకు ఇంకా సమయం ఉంది.

– రవినాథ్, ఏఓ, యాచారం

## ద్విచక్ర వాహన దొంగల అరెస్టు

**ఆమనగల్లు:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిలిపి ఉంచిన మోటార్ బైక్‌ను అపహరించిన ఇద్దరు దొంగలను మంగళవారం ఆమనగల్లు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన చాట్ల శివ గత నెల 21న ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బైక్‌ను పార్క్ చేసి పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో అదేరోజు శివ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అనంతరం కానిస్టేబుళ్లకు కేసు అప్పగించగా సీసీ కెమెరాల సహాయంతో దొంగలను గుర్తించారు. జిల్లాలోని ఫరూక్‌నగర్ మండలం కొండన్నగూడ గ్రామానికి చెందిన దాసరి శ్రీకాంత్, దాసరి శివలు మోటార్‌బైక్‌ను దొంగతనం చేసినట్లు గుర్తించి, వారిని అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుదాఘాతంతో నెమలి మృతి


నెమలిని తీసుకెళ్తున్న అటవీశాఖ సిబ్బంది

**ఇబ్రహీంపట్నం:** విద్యుదాఘాతంతో జాతీయ పక్షి నెమలి మృత్యువాత పడిన సంఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం కోర్టు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నెమలి పైకి లేచే ప్రయత్నంలో కోర్టు సమీపంలోని విద్యుత్ స్తంభం తీగలకు తగలింది. దీంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. అటవీశాఖ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో నెమలిని తీసుకెళ్లి పూడ్చిపెట్టారు.

## పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని ఫిర్యాదు

**ఇబ్రహీంపట్నం:** పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని ఓ వ్యక్తి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు.. ఇబ్రహీంపట్నానికి చెందిన జలమోని రవీందర్ ఇటీవల శేరిగూడ సమీపంలో ఓ బంకులో తన బుల్లెట్ బైక్‌లో పెట్రోల్ పోయించుకున్నాడు. అనంతరం బైక్ మొరాయించడంతో మరమ్మతు చేయించుకున్నాడు. మంగళవారం అదే బంకులో అర లీటర్ పెట్రోల్‌ను బాటిల్ కొట్టించుకొని పరిశీలిస్తే కిందిభాగంలో నీరు కనిపించింది. సదరు బంకుపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తూనికలు, కొలతల శాఖ పరిధిలోకి ఈ అంశం వస్తుందని ఎస్ఐ నాగరాజు తెలిపారు.



## నెల క్రితం అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య


అంజయ్య (ఫైల్)

**ఆమనగల్లు:** నెల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి శవమైన సంఘటన ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిపల్లికి చెందిన కంబాలపల్లి అంజయ్య(57) గత నెల 13న కనిపించకుండా పోవడంతో అతని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని గుట్టపై చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని కనిపించడంతో గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం అంజయ్య కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని చూపించడంతో చనిపోయింది అంజయ్యగా నిర్ధారించారు. అనంతరం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రి నుంచి డాక్టర్‌ను పిలిపించి సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్


నినాదాలు చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

**షాద్‌నగర్‌రూరల్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరేళ్లుగా విద్యార్థుల బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8,158 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు తరగతులను బహిష్కరిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పై చదువుల కోసం సర్టిఫికెట్లను తెచ్చుకునేందుకు కళాశాలకు వెళితే ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజయాన్యాలు చెపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపై నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సుమయిర్, ఉపాధ్యక్షుడు ఆదిల్, కార్యదర్శి శివశంకర్, నాయకులు యూసుఫ్, మజర్, ఆరీఫ్, హర్ష, రెహమాన్, అబ్బు, సుభాష్, అయాన్, ఆరీఫ్, మహేష్, శమీ, ఫయూం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బైండోవర్ చేసిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

**శంకర్‌పల్లి:** అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిన ఓ వ్యక్తిపై చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మోకిలలో ముక్తార్ అలీ కేకే దాబా నిర్వహిస్తున్నాడు. ఇక్కడ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో గత నెల ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి, ముక్తార్ అలీపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. అతను బైండోవర్‌లో ఉంటూ మళ్లీ దాబాలో మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీంతో దాడులు చేసి మళ్లీ కేసు నమోదు చేశారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తి మళ్లీ అదే తప్పు చేయడంతో శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ వారం రోజుల గడువు ఇచ్చి, రూ.లక్ష జరిమానా ముక్తార్ అలీకి విధించారు. దీంతో అతడు మంగళవారం జరిమానా డబ్బులు చెల్లించారు. ఈ సందర్భంగా.. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడితే, కఠిన శిక్షలు ఉంటాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

## దేవాలయంలో చోరీ

**యాచారం:** మండల పరిధిలోని మాల్ గ్రామం ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి దుండగులు చోరీ చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి దేవతామూర్తుల వద్ద ఉన్న విలువైన ఆభరణాలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. వాటి విలువ ఎంతనే అంశంపై స్పష్టత లేదు. దేవాలయంలో చోరీపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## లారీ ఢీకొనడంతో పల్టీకొట్టిన కారు


లారీ ఢీకొట్టడంతో తలకిందులుగా పడిన కారు

**మియాపూర్:** జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన లారీ వెనుక నుండి కారును ఢీకొట్టడంతో డివైడర్‌కు తాకి తలకిందులుగా పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న యువకుడికి గాయాలయ్యాయి. మియాపూర్ ఎస్ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం..చందానగర్‌లోని అపర్ణ హిల్ పార్క్‌లో నివాసం ఉంటున్న తన్మయ్ మియాపూర్ నుండి చందానగర్‌లోని తన ఇంటికి కారులో జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మదీనాగూడ అంకుర్ ఆసుపత్రి వద్దకు రాగానే వెనుక నుంచి చందానగర్ వైపు వస్తున్న లారీ వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని తలకిందులుగా పడిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి కారులో ఉన్న తన్మయ్‌ను బయటకు తీసి సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు కారును రోడ్డుపై నుంచి తొలగించారు. లారీ డ్రైవర్ రమేష్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులకు తన్మయ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## ఇంట్లో పార్కు చేసిన ద్విచక్రవాహనాలు దగ్ధం

**ఉప్పల్:** బోనాల పండుగకు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో పార్కు చేసిన ద్విచక్ర వానాలను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన సంఘటన రామంతాపూర్ ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి పాత బస్తీలో బోనాల పండుగకు బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ఆవరణలోకి చొరబడి దిచక్రవాహనాలకు నిప్పుపెట్టి దగ్ధం చేశారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ ఇంటికి వచ్చి చూసి..ఉప్పల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ పుటేజీలను పరిశీలించగా..ఇద్దరు వ్యక్తులు కన్పించారని, వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు చేస్తున్న ముఠా


పట్టుబడిన నిందితులు

**మొయినాబాద్:** తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి బంగారం, నగదు దోచుకెళ్లిన దొంగలను రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌కు చెందిన బొర్ర జంగయ్య ఇంట్లో ఈ నెల 17న చోరీ జరిగింది. 16న బోనాల పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి అమీర్‌గూడలో ఉండే తన అక్క ఇంటికి వెళ్లారు. 17న సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు, రెండు బీరువాల తాళాలు పగులగొట్టి 9 తులాల బంగారు నగలు, రూ.3.70 లక్షల నగదు దోచుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ టీవీ పుటేజీల ఆధారంగా మంగళవారం రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు కాళీమందిర్ సమీపంలో ముగ్గురు అనుమానితులు మియాపూర్‌కు చెందిన షేక్ అబ్బు తలీబ్ అలియాస్ ఫైజాన్, అబ్దుల్ రియాజ్ అలియాస్ డాన్, మెహదీపట్నం రేతిబౌలికి చెందిన షేక్ ఉస్మాన్ అలియాస్ సైఫ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించడంతో సంగారెడ్డిలో ఆటో దొంగిలించి, మణికొండలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన తరువాత మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద 10 తులాల బంగారు ఆభరణాలు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.3.26 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# మిత్రులకు బెయిల్ ఇప్పించేందుకు..

- మహారాష్ట్ర నుంచి వచ్చి నగరంలో దొంగతనాలు
- పాతనేరస్తుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావెద్

**సికింద్రాబాద్:** తన మిత్రులైన సహ నేరగాళ్లకు బెయిల్ ఇప్పించడం కోసం మహారాష్ట్ర నుంచి నగరానికి వచ్చి..లాడ్జిల్లో బస చేస్తూ..రైళ్లలో ప్రయాణాలు చేస్తూ టార్గెట్ చేసిన ప్రయాణికుల బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్న ఓ ఘరానా నేరగాన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. లోగడ పలుమార్లు ఈ తరహా నేరాలకు పాల్పడి బెయిల్‌పై బయటకు వచ్చాడు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్ఎన్ జావెద్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయిశ్వర్‌గౌడ్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సారస్వత్ తెలిపిన వివరాల ప్రకారం..కర్నాటకకు చెందిన మోతీలాల్ రెడ్డప్ప పవార్ (24) ఉపాధి కోసం మహారాష్ట్రకు వెళ్లాడు. వ్యసనాలకు బానిసైన ఇతడు రైలు ప్రయాణాల్లో 30 నేరాలకు పాల్పడ్డాడు. కొద్ది రోజుల క్రితం బెయిల్‌పై బయటికి వచ్చిన మోతీలాల్ రెడ్డప్ప పవార్‌కు తనతో పాటు మహారాష్ట్రలో జైలుకు వెళ్లిన సహనేరస్తులకు బెయిల్ ఇప్పించడం కోసం డబ్బు అవసరం అయింది. ఇందుకోసం హైదరాబాద్ చేరుకున్న అతడు పలు లాడ్జీల్లో బసచేసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దొంగతనాలు చేయడం కోసం పథకం సిద్ధం చేసుకున్నాడు. ఈనెల 17న ఎంఎంటీఎస్ రైలు ఎక్కిన నిందితుడు రెండు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. కేసులు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా పుటేజీల ద్వారా నిందితుడిని గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో తచ్చాడుతుండగా మోతీలాల్ రెడ్డప్ప పవార్‌ను ఈ నెల 21న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు.

## మాంసాహారం విషతుల్యమై ఒకరి మృతి!

మరో 9 మందికి అస్వస్థత


అనంత శ్రీనివాస్ యాదవ్ (ఫైల్)

**వనస్థలిపురం:** బోనాల పండుగ వేళ ఓ ఇంటిలో విషాదం నెలకొంది. పండుగ సందర్భంగా వండుకున్న మాంసాహారం విషతుల్యమై ఒకరు మృతిచెందగా మరో 9 మంది ఆసుపత్రి పాలయ్యారు. ఈ సంఘటన వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఆర్‌టీసీ కాలనీలో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం ఫతేపురానికి చెందిన అనంత శ్రీనివాస్ యాదవ్ ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ భార్యా పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ఆర్‌టీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బోనాల సందర్భంగా బంధువులను పిలిచి..ఆదివారం రాత్రి బోటి, చికెన్ తీసుకువచ్చి ఇంట్లో వండుకుని కుటుంబ సభ్యులందరూ తిన్నారు. అదేరోజు రాత్రి వీరిలో కొందరికి విరోచనాలు కావడంతో తార్నాకలోని ఆస్పత్రికి వెళ్లి టాబ్లెట్లు తెచ్చుకుని వేసుకున్నారు. కాగా మంగళవారం శ్రీనివాస్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చింతలకుంటలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా ఆదివారం రాత్రి శ్రీనివాస్ తండ్రి మాంసాహారం తినకపోవడంతో అతన్ని మినహాయించి మిగతా అందరూ అస్వస్థతకు గురై ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో శ్రీనివాస్ తల్లి గౌరమ్మ, చిన్న కూతురు జస్మిత ఐసీయూలో ఉన్నారు. సోమవారమే ఇక్కడి నుంచి వెళ్లిపోయిన శ్రీనివాస్ అక్క చంద్రిక అస్వస్థతకు గురికాగా మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. వండుకున్న మాంసాహారంను ఫ్రిజ్‌లో పెట్టలేదని, ఏం జరిగిందో తెలియడం లేదని శ్రీనివాస్ బావ సంతోష్‌కుమార్ తెలిపారు.